సాక్షి అనంతపురం

శుక్రవారం । 23 । ఆగస్టు । 2024



టన్ను చీనీ రూ.23 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.23 వేలు పలికాయి.



టమాట కిలో రూ.20

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.20, కనిష్టంగా రూ.6 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం

35.7°/23.4°

జిల్లాలో గురువారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. సాయంత్రం తర్వాత ఆకాశం మేఘావృతమై పలుచోట్ల వర్షం కురిసింది. గంటకు 6 నుంచి 10 కి.మీ వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

అండగా ఉంటా.. ధైర్యంగా ఉండండి

- వైఎస్సార్‌సీపీ నాయకుడు కందిగోపులకు వైఎస్ జగన్ భరోసా



మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో కందిగోపుల మురళీప్రసాద్‌రెడ్డి

తాడిపత్రిటౌన్: 'ధైర్యంగా ఉండండి. పార్టీ మీ కుటుంబానికి అండగా ఉంటుంది' అని మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చింతల వెంకటరమణ స్వామి ఆలయ కమిటీ చైర్మన్ కందిగోపుల మురళీప్రసాద్ రెడ్డికి భరోసా ఇచ్చారు. తాడిపత్రిలో మూడు రోజుల క్రితం టీడీపీ మూకలు రెచ్చి పోయి కందిగోపుల ఇంటిపై దాడికి దిగడంతో పాటు కార్లను ధ్వంసం చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌ను గురువారం విజయవాడలోని పార్టీ కార్యాలయంలో కందిగోపుల మురళీ ప్రసాద్‌రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ మాట్లాడుతూ త్వరలో మంచి రోజులు వస్తాయని భరోసా ఇచ్చారు. ధైర్యం కోల్పోరాదని సూచించారు.

విద్యార్థులకు శుభవార్త

- ఎస్సీ గురుకులాల్లో 183 అదనపు సీట్లకు అనుమతులు
- మెరిట్ ఆధారంగా అవకాశం

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లాలోని 5–8 తరగతుల విద్యార్థులకు శుభవార్త. సాంఘిక సంక్షేమ (అంబేడ్కర్) గురుకుల పాఠశాలల్లో 183 అదనపు సీట్లకు అనుమతులు లభించాయి. ఇక్కడి పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కలెక్టర్ చొరవ తీసుకుని ప్రతిపాదనలు పంపారు. ఆయా తరగతుల్లో సెక్షన్‌కు 5 సీట్ల చొప్పున తరగతికి 90కు మించకుండా 183 సీట్లు భర్తీ చేయనున్నారు. ఈ మేరకు సొసైటీ కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారని గురుకుల పాఠశాలల ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ మురళీకృష్ణ తెలిపారు. 5వ తరగతి అదనపు సీట్లకు 'బీఆర్ ఏజీసీఈటీ–2024' పరీక్షలో మెరిట్ ఆధారంగా భర్తీ చేస్తామన్నారు. 6,7,8 తరగతులకు ప్రవేశ పరీక్ష నిర్వహించి మెరిట్ ఆధారంగా భర్తీ చేస్తామన్నారు. శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ కూడా అదనపు సీట్ల కోసం ప్రతిపాదనలు పంపారని అనుమతులు రాగానే ఆ జిల్లాలోనూ అదనపు సీట్లు భర్తీ చేస్తామని వెల్లడించారు.

'ఎన్‌ఎంఎంఎస్'కు దరఖాస్తులు



అనంతపురం ఎడ్యుకేషన్: నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) పరీక్షకు అర్హులైన విద్యార్థులు సెప్టెంబరు 6లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి వరలక్ష్మీ సూచించారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. డిసెంబరు 6న పరీక్ష ఉంటుందన్నారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మునిసిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు, వసతి సౌకర్యం లేని మోడల్ స్కూళ్లలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. కుటుంబ సంవత్సరాదాయం రూ. 3.50 లక్షలలోపు ఉండాలన్నారు. దరఖాస్తు సమయంలో ఎలాంటి ధ్రువపత్రాలు అవసరం లేదన్నారు. పరీక్ష రాసే సమయానికి అన్ని పత్రాలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ. 100, ఎస్సీ,ఎస్టీ విద్యార్థులు రూ. 50 పరీక్ష ఫీజు చెల్లించాల్సి ఉంటుందని వెల్లడించారు. ఆన్‌లైన్ దరఖాస్తు www.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటుందన్నారు. దరఖాస్తులో ఇచ్చిన ఎస్‌బీఐ కలెక్ట్ లింక్ ద్వారా మాత్రమే పరీక్ష ఫీజు చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. మరిన్ని వివరాలకు వెబ్‌సైట్ లేదా అనంతపురం కమలానగర్‌లోని పాత డీఈఓ కార్యాలయ పరీక్ష విభాగంలో సంప్రదించాలని డీఈఓ సూచించారు.

జెన్‌ప్యాక్ట్‌లో ఉద్యోగాలు

అనంతపురం సెంట్రల్: జెన్‌ప్యాక్ట్ కంపెనీలో కంటెంట్ మోడరేషన్, కస్టమర్ సర్వీస్, వాయిస్ సపోర్ట్ విభాగాల్లో 1,500 పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఆనంద్‌రాజ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ, బీటెక్ పట్టభద్రులు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 24లోపు దరఖాస్తులు అందజేయాలని కోరారు. మరిన్ని వివరాలకు 8317520929 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

- అనంతపురం నగరానికి చెందిన ఓ యువకుడు తలకు దెబ్బ తగిలిందంటూ ఇటీవల మద్యం మత్తులో సర్వజనాస్పత్రి క్యాజువాలిటీకి వచ్చాడు. వైద్యులు స్పందించి చికిత్స అందించే లోపే ఆలస్యం చేస్తారా అంటూ సీఎంఓ, పీజీ వైద్యులు, స్టాఫ్‌నర్సులతో వాగ్వాదానికి దిగాడు. ఈ క్రమంలోనే టూటౌన్ పోలీసులకు ఫోన్ చేయగా పోలీసులు వచ్చి అతన్ని స్టేషన్‌కు తీసుకెళ్లారు.
- రెండు నెలల క్రితం సర్వజనాస్పత్రిలో విధుల్లో ఉన్న సీఎంఓ, పీజీలతో రూరల్ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి అనుచితంగా ప్రవర్తించాడు. వైద్యులను దుర్భాషలాడాడు. సకాలంలో ఎందుకు వైద్యం అందించరంటూ వైద్యులతో గొడవకు దిగాడు. మెడ తిప్పేస్తానంటూ ఓ వైద్యురాలిని హెచ్చరించాడు. సర్వజనాస్పత్రిలో విధులు నిర్వర్తించే వైద్యుల భద్రత ఎంత ఘోరంగా ఉందో తెలిపే ఘటనిలివీ.



అక్యూట్ మెడికల్ కేర్‌లో రోగులకు సేవలందిస్తున్న పీజీ వైద్య విద్యార్థులు, నర్సులు

సాక్షి పరిశీలన

భద్రత గగనం

భయం గుప్పిట్లో వైద్యం

- సర్వజనాస్పత్రిలో పీజీ వైద్యులు, మహిళా వైద్యులు, స్టాఫ్‌నర్సులకు రక్షణ కరువు
- సరైన భద్రత లేక భయం భయం
- ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలంటున్న వైనం

అనంతపురం మెడికల్: కోల్‌కతాలోని ఓ ప్రభుత్వ ఆస్పత్రిలో ఇటీవల చోటుచేసుకున్న ఓ వైద్య విద్యార్థి హత్యాచార ఘటన యావత్ దేశాన్నీ కదిలించింది. ఏకంగా సుప్రీంకోర్టు ఈ కేసును స్వయంగా స్వీకరించి విచారణ చేపట్టడం సంచలనం సృష్టించింది. ఈ క్రమంలో వైద్య విద్యార్థులు, మహిళా వైద్యులు ఎంతటి దుర్భర పరిస్థితుల్లో విధులు నిర్వర్తిస్తున్నారనే విషయం చర్చనీయాంశమైంది. అనంతపురంలోని సర్వజనాస్పత్రిలోనూ వైద్య విద్యార్థులు, మహిళా వైద్యులు, స్టాఫ్‌నర్సులు భయం గుప్పిట్లో వైద్యం అందిస్తున్నారంటే ఆశ్చర్యం కలగకమానదు.

కానరాని భద్రత..

వైద్యో నారాయణో హరీ అని వైద్యున్ని దేవునితో పోల్చుతాం. అలాంటి వైద్యులకు అనంతపురం సర్వజనాస్పత్రిలో భద్రత లేకుండా పోయింది. సీసీ కెమెరాలు సరిగా పని చేయకపోవడంతో అర్ధ రాత్రి వేళ కొందరు తప్పతాగి వైద్యం పేరుతో ఎమర్జెన్సీ వార్డులోకి చొరబడుతున్నారు. ఈ క్రమంలో సిబ్బందితో గొడవకు దిగడం సర్వసాధారణంగా మారింది. పోలీసుల స్పందన కరువవడంతో పోస్టు గ్రాడ్యుయేషన్ వైద్య విద్యార్థులు, మహిళా వైద్యులు, స్టాఫ్ నర్సులు భయంతోనే విధులు నిర్వర్తిస్తున్నారు. సెక్యూరిటీ సిబ్బంది 107 మంది ఉన్నా చాలడం లేదు.

కనీస సౌకర్యాలు నిల్..

బోధనాస్పత్రిలో 20 విభాగాల్లో 351 మంది పీజీ విద్యార్థులు రోగులకు సేవందిస్తున్నారు. రాత్రి వేళ మెడిసిన్, సర్జరీ, గైనిక్, ఆర్థో, ఈఎన్‌టీ, అనస్తీషియా తదితర విభాగాల్లో 30 మందిపైగా ఉంటారు. నైట్ డ్యూటీ విధుల్లో 36 గంటల పాటు నిర్విరామంగా పని చేయాల్సి ఉంటుంది. రోగుల ప్రాణాలు కాపాడేందుకు అహర్నిశలు శ్రమిస్తున్న అలాంటి వారికి కనీస ప్రమాణాలైన తాగునీరు, బాత్‌రూంలు, రెస్ట్ రూంలు కూడా కరువయ్యాయి. మూత్ర విసర్జనకు క్వార్టర్స్‌కు పరుగులు తీయాల్సి వస్తోంది. పీజీ క్వార్టర్స్ పరిసరాల్లో కేవలం ఒక్క సీసీ కెమెరా మాత్రమే ఉంది. రాత్రిళ్లలో వీధి లైట్లు పనిచేయడం లేదు. దీన్ని బట్టి ఎంత అధ్వాన పరిస్థితుల్లో పీజీ విద్యార్థులు, మహిళా వైద్యులు విధులు నిర్వర్తిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. ఇక.. క్వార్టర్స్‌లో పీజీ విద్యార్థులకు సరిపడా గదులు లేక చాలా మంది బయటకు అద్దెకు ఉంటున్నారు.

స్టాఫ్‌నర్సుల పరిస్థితి దయనీయం

సర్వజనాస్పత్రిలో రౌండ్ ద క్లాక్ సేవలందించే స్టాఫ్‌నర్సుల పరిస్థితి కూడా దయనీయంగా మారింది. ఆస్పత్రిలో 400 మందికిపైగా రెగ్యులర్, కాంట్రాక్ట్ స్టాఫ్‌నర్సులు రోగులకు సేవలందిస్తున్నారు. అలాంటి వారు వాష్‌రూంలు లేక అవస్థలు పడుతున్నారు. కనీసం డ్రెస్సు మార్చుకునేందుకు ప్రత్యేకంగా గది లేదు. ఇటీవల మానసిక వైద్య విభాగం వార్డులో ఓ స్టాఫ్‌నర్సును రోగి కాలితో తన్నాడు. దీంతో స్టాఫ్‌నర్సు కంటతడి పెట్టుకోవాల్సి వచ్చింది. ఎమర్జెన్సీ వార్డులో కొన్ని రోజుల క్రితం ఓ వ్యక్తి మృతి చెందగా.. మృతుడి బంధువులు స్టాఫ్‌నర్సులపై దాడికి యత్నించారు. ఎంఎం వార్డులో ఓ స్టాఫ్‌నర్సును వ్యక్తి దుర్భాషలాడాడు. స్టాఫ్‌నర్సు ఫొటోలు తీసి భయాందోళనకు గురి చేశాడు. దీంతో డ్యూటీలు చేయలేమంటూ స్టాఫ్‌నర్సులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



డ్రెస్ మార్చుకునేందుకు గది లేక స్టాఫ్‌నర్సులు వేసుకున్న కర్టెన్

ఆస్పత్రి అధికారులు కూడా స్టాఫ్‌నర్సులను చిన్న చూపు చూస్తున్నారు. వారి విధుల విషయంలో జోక్యం చేసుకుంటూ వేధిస్తున్నారు. తమకు సదుపాయాలు కల్పించకపోయినా ఫర్వాలేదు మహిళలనే కనీస గౌరవంతో సదుపాయాలు కల్పించాలని కొందరు సీనియర్ స్టాఫ్‌నర్సులు, హెడ్ నర్సులు విజ్ఞప్తి చేశారు.

సౌకర్యాలు మెరుగుపరచాలి



పీజీ వైద్యులపై దాడులు జరిగితే ఎవరికి ఫిర్యాదు చేయాలో అర్థం కావడం లేదు. ఆస్పత్రిలో ఫిర్యాదుల బాక్సు ఎక్కడుందో తెలియదు. సమస్యలు తలెత్తితే ఎవరికి విన్నవించాలో తెలియడం లేదు. ఎమర్జెన్సీ వార్డులో తాగేందుకు నీళ్ల లేవు. నిఘా అంతంత మాత్రమే. కలెక్టర్ వినోద్‌కుమార్ స్పందించి సౌకర్యాలు మెరుగుపర్చాలి.

– హరికిరణ్, ఆప్ జూడా అధ్యక్షుడు

సెక్యూరిటీ డ్యూటీ చేయాల్సి వస్తోంది



ఇటీవల అక్యూట్ మెడికల్ కేర్‌లో విధులు నిర్వర్తించే సమయంలో కరెంటు పోయిందని రోగుల సహాయకులు మాతో గొడవకు దిగారు. అత్యవసర కేసులు చూసే సమయంలో ఎవరికి సేవలందించాలి. మహిళలుండే గైనిక్, లేబర్ వార్డుల్లో పురుషులే అధికంగా ఉంటున్నారు. మేమే సెక్యూరిటీ డ్యూటీ చేసి బయటకు పంపాల్సి వస్తోంది. బయటకు వెళ్లమని చెబితే మాతో గొడవకు దిగుతున్నారు.

– అస్ర, పీజీ విద్యార్థి, గైనిక్

ఏమైనా జరిగితే ఎవరు దిక్కు?



రాత్రి వేళ ఎమర్జెన్సీ వార్డులో విధులు నిర్వర్తించే సమయంలో బాత్‌రూంలు ఉండవు. ఆ సమయంలో మూత్రవిసర్జనకు వెళ్లాలంటే క్వార్టర్స్‌కు రావాలి. ఆ ప్రాంతంలో వీధి లైట్లు లేకపోవడంతో చీకటిగా ఉంటుంది. అయినా పేదలకు సేవ చేయడమే పరమావధిగా కష్టాలు భరిస్తున్నాం. రాత్రి వేళ ఏమైనా జరిగితే ఎవరు దిక్కు. కనీస వసతులు కూడా లేకపోతే ఎలా?

– మంజుల, పీజీ విద్యార్థి, సర్జరీ

అర్ధరాత్రి స్టేషన్‌కు వెళ్లాల్సి వచ్చింది



ఎమర్జెన్సీ వార్డులో విధులు నిర్వర్తించే సమయంలో మద్యం మత్తులో వచ్చేవారితో పెద్ద సమస్య. వారి మాటతీరు సరిగా ఉండదు. కొన్ని నెలల క్రితం ఇద్దరు వచ్చారు. రోగిని సరిగా చూడలేదని మాతో వాదనకు దిగారు. సీఎంఓను దుర్భాషలాడారు. ఆ సమయంలో పోలీసులకు ఫోన్ చేశాం. అర్ధరాత్రి స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసి వచ్చాం.

– పవన్‌కుమార్, పీజీ విద్యార్థి, మెడిసిన్

నిఘా వ్యవస్థను బలోపేతం చేయాలి



పీజీ వైద్యులకు భద్రతతో పాటు విధులు నిర్వర్తించే చోట మౌలిక సదుపాయాలు కల్పించాలి. తాగునీరు, బాత్‌రూంలు ఉండాలి. నైట్ డ్యూటీ ఉన్నప్పుడు 36 గంటల పాటు పని చేయాల్సి ఉంటుంది. అటువంటి వారికి విశ్రాంతి గదులు ఏర్పాటు చేస్తే బాగుంటుంది. భద్రతకు సంబంధించి నిఘా వ్యవస్థను బలోపేతం చేయాలి. రోగి సహాయకులను ఎక్కువగా వార్డుల్లోకి అనుమతించకూడదు. రాత్రి వేళల్లో పోలీసుల పర్యవేక్షణ ఉండాలి.

– డాక్టర్ రామస్వామి నాయక్, ప్రభుత్వ వైద్యుల సంఘం అధ్యక్షుడు

భద్రత కట్టుదిట్టం చేయాలి



కోల్‌కతాలో పీజీ విద్యార్థినిపై జరిగిన ఘటనను అందరూ ఖండించాలి. అటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు ఆస్పత్రుల్లో భద్రతను కట్టుదిట్టం చేయాలి. సెక్యూరిటీని తరచూ అప్రమత్తం చేయాలి. మహిళా వైద్యులు ఏదైనా సమస్యపై ఇతర వార్డులకు వెళ్తే మహిళా సెక్యూరిటీ సిబ్బందిని వెంట పంపాలి. అప్పుడే వైద్యులపై దాడులు, అఘాయిత్యాలను నియంత్రించగలం.

– డాక్టర్ జగన్నాథ్, విశ్రాంత సూపరింటెండెంట్, జీజీహెచ్

చాలా మంది అద్దె గదుల్లో ఉంటున్నారు



పీజీలో చేరిన 5 నెలల వరకు క్వార్టర్స్‌లో గది దొరకలేదు. ఎన్నో సార్లు బతిమాలుకుంటే చివరకు దొరికింది. మొదట్లో అద్దె గదిలో ఉన్నాం. ఇప్పటికీ చాలా మందికి క్వార్టర్స్‌లో గదులు లేవు. బయట ఉంటున్నారు. ఈ విషయంపై ప్రభుత్వం స్పందించాలి.

– శ్రీనివాస్, పీజీ విద్యార్థి, సర్జరీ

రక్షణ కల్పించాలి

వైద్యులకు రక్షణ కల్పించాలంటూ ఆప్ జూడా ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం అనంతపురం నీలం సంజీవరెడ్డి స్టేడియంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కోల్‌కతాలో జరిగిన ఘటనను హృద్యంగా ప్రదర్శించారు. వైద్యురాలిని ఎంత పాశవికంగా ఇబ్బంది పెట్టి, హత్య చేశారో కళ్లకు కట్టినట్లు చూపి కన్నీళ్లు పెట్టించారు. అనంతరం ఫ్లాష్ మాబ్, మెడికో ఫైనల్ ఇయర్ విద్యార్థి కృష్ణకాంత్ ప్రదర్శించిన ఏకపాత్రాభినయం, 2కే20 బ్యాచ్ వైద్య విద్యార్థులు, పీజీలు ప్రదర్శించిన నృత్యాలు అందరినీ ఆలోచింపచేశాయి. కార్యక్రమంలో ఏపీ ఎన్‌జీఓ ఉమెన్ వింగ్ జిల్లా చైర్‌పర్సన్ జమీలా బేగం, జిల్లా కోశాధికారి ప్రవీణ్‌కుమార్, సహాయ కార్యదర్శి శోభారాణి, నాయకులు లక్ష్మన్న, శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కన్నీరు పెట్టుకుంటున్న విద్యార్థినులు

- ప్రభుత్వ సర్వజనాస్పత్రి ఆవరణలో నిరసన చేపట్టిన పీజీ వైద్య విద్యార్థులు, హౌస్‌సర్జన్లకు ప్రభుత్వ వైద్యుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ రామస్వామి నాయక్, ఏపీ ఎన్‌జీఓ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చంద్రశేఖర్ రెడ్డి, చంద్రమోహన్, ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి మద్దతు తెలిపారు. వైద్యుల రక్షణ చట్టాన్ని సుప్రీంకోర్టు తీసుకురావాలని డిమాండ్ చేశారు.





అవగాహన సదస్సుకు హాజరైన వైద్య విద్యార్థులు, నర్సింగ్ విద్యార్థినులు



డ్రామాలో ఓ సన్నివేశం

పెద్దారెడ్డిని తాడిపత్రికి వెళ్లనివ్వండి

- ఎస్పీ జగదీష్‌ను కోరిన వైఎస్సార్ సీపీ నేతలు
- లేకుంటే తామే పిలుచుకుని వెళ్తామని స్పష్టీకరణ
- హింసా రాజకీయాలపై కఠినంగా వ్యవహరించాలని విజ్ఞప్తి
- చంద్రబాబు ప్రభుత్వంలో వ్యవస్థలకు రక్షణ లేకుండా పోయిందని విమర్శ



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, చిత్రంలో ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, మాజీ ఎంపీ తలారి రంగయ్య, మాజీ ఎమ్మెల్యేలు మాలగుండ్ల శంకర నారాయణ, కేతిరెడ్డి పెద్దారెడ్డి

అనంతపురం కార్పొరేషన్: 'ఓ మాజీ శాసన సభ్యుడిని తన నివాసానికి వెళ్లకుండా అడ్డంకులు సృష్టిస్తున్నారు. కేతిరెడ్డి పెద్దారెడ్డి తాడిపత్రిలో ఉండేలా పోలీసులు చర్యలు తీసుకోవాలి. లేని పక్షంలో జిల్లాలోని వైఎస్సార్ సీపీ శ్రేణులు, మేమంతా కలసి తాడిపత్రికి పిలుచుకుని వెళ్తాం' అని వైఎస్సార్ సీపీ నేతలు స్పష్టం చేశారు. గురువారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ జగదీష్‌ను ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, మాజీ మంత్రి శంకరనారాయణ, మాజీ ఎమ్మెల్యేలు అనంత వెంకటరామిరెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, మాజీ ఎంపీ తలారి రంగయ్య తదితరులు కలిశారు. తాడిపత్రిలో జరుగుతున్న హింసాత్మక ఘటనలు, జిల్లాలోని ఇతర నియోజకవర్గాల్లో నెలకొన్న పరిస్థితులపై ఎస్పీతో చర్చించారు. తమ పార్టీ నాయకులు, కార్యకర్తలపై అధికార పార్టీ నేతలు దాడులకు పాల్పడి ఆస్తులు ధ్వంసం చేస్తే ప్రజాస్వామ్యబద్ధంగా ప్రతిఘటిస్తామని స్పష్టం చేశారు. ఎస్పీని కలిసిన అనంతరం మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ జిల్లా ఎస్పీ నుంచి సానుకూల నిర్ణయం రాకపోతే రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలుంటాయన్నారు. తాడిపత్రిలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. తమ పార్టీ నాయకులపై దాడులు చేసి వారిపైనే కేసులు పెట్టడం ఎంత వరకు సమంజసమన్నారు. మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డికి రక్షణ లేకుండా చేస్తున్నారన్నారు. ఇలాంటి పరిణామాలను గతంలోనూ చూశామని, వీటిని ధైర్యంగా ఎదుర్కొంటామన్నారు. మాజీ ఎంపీ తలారి రంగయ్య మాట్లాడుతూ శాంతి భద్రతలు పరిరక్షించడంలో చంద్రబాబు ప్రభుత్వం విఫలమైందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కక్షా రాజకీయాలకు తావివ్వలేదన్నారు. పోలీసులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని తాడిపత్రిలోకి అనుమతించాలన్నారు. మాజీ మంత్రి శంకరనారాయణ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఆటవిక పాలనను సాగిస్తున్నారన్నారు. హామీలు అమలు చేయకుండా హింసను ప్రేరేపిస్తున్నారన్నారు. తాడిపత్రిలో జేసీ ప్రభాకర్ రెడ్డి రౌడీయిజాన్ని పోలీసులు అడ్డుకోలేరా? అని ప్రశ్నించారు. పోలీసులు కఠిన చర్యలు తీసుకోకపోతే ప్రజా ఉద్యమం తప్పదన్నారు. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి మాట్లాడుతూ తాడిపత్రిలో జేసీ ప్రభాకర్ రెడ్డి అరాచకాలు తీవ్రమయ్యాయన్నారు. తనను పట్టణానికి రానివ్వనని బాహాటంగా ప్రకటించి, దాడులు చేస్తున్నా పోలీసులు పట్టించుకోవడం లేదన్నారు. ఎన్నికల సమయంలో, ఇటీవల జరిగిన ఘటనల గురించి ఎస్పీకి తెలియజేసినట్లు తెలిపారు. ఎస్పీని కలిసిన వారిలో కార్పొరేటర్ సాకే చంద్రశేఖర్, జేఏసీ కన్వీనర్ శివారెడ్డి తదితరులు ఉన్నారు.

పక్కాగా ఇసుక విధానం అమలు

- ప్రస్తుతం అందుబాటులో 20,990 టన్నుల ఇసుక
- అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు
- కలెక్టర్ వినోద్‌కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్, చిత్రంలో ఎస్పీ, జేసీ

అనంతపురం అర్బన్: జిల్లాలో ఇసుక విధానం పక్కాగా అమలయ్యేలా చర్యలు తీసుకున్నామని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జాయింట్ కలెక్టర్ శివ నారాయణ శర్మ, ఎస్పీ పి.జగదీష్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో ప్రస్తుతం ఒక రీచ్ ఉందన్నారు. అక్టోబరు 15 తరువాత ఐదు రీచ్‌లకు దరఖాస్తు చేశామన్నారు. ప్రస్తుతం జుంజురాంపల్లి వద్ద 20,990 టన్నుల ఇసుక అందుబాటులో ఉందన్నారు. ఒక టన్ను ఇసుకకు పన్ను, రవాణా చార్జీలు కలిపి రూ.195గా నిర్ణయించామన్నారు. నిర్ణయించిన ధర కంటే అధికంగా వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అక్రమ రవాణాపై కఠిన చర్యలు ఉంటాయన్నారు.

నేటి నుంచి గ్రామసభలు

జిల్లావ్యాప్తంగా అన్ని పంచాయతీల్లో శుక్రవారం నుంచి గ్రామసభలు నిర్వహించాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం క్షేత్రస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సర్పంచ్ అధ్యక్షతన సభలు నిర్వహించాలన్నారు. అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు, సామాజిక బాధ్యత వహించే వారిని భాగస్వాముల్ని చేయాలన్నారు. ప్రజల నుంచి అందే వినతుల ఆధారంగా అభివృద్ధి పనులు గుర్తించి తదనుగుణంగా ప్రణాళికలు రూపొందించాలని చెప్పారు. ఈఎంఎస్ యాప్ ద్వారా ఫొటోలు, వీడియోలు, మినిట్స్ నోట్ డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేయాలన్నారు. సభలకు ఎక్కువ మంది ప్రజలు వచ్చేలా చూడాలన్నారు. వారి అవసరాలను సభలో తెలియజేసి గ్రామాభివృద్ధికి తోడ్పడాలనే విషయాన్ని వివరించాలన్నారు. కాన్ఫరెన్స్‌లో డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డి, డీపీఓ ప్రభాకర్‌రావు, జెడ్పీ సీఈఓ ఓబుళమ్మ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి కలెక్టర్ మూడు రోజులు సెలవు

కలెక్టర్ వి.వినోద్‌కుమార్ వ్యక్తిగత పనులపై మూడు రోజుల పాటు సెలవులో వెళుతున్నారు. శుక్రవారం నుంచి 25వ తేదీ (ఆదివారం) వరకు ఆయన సెలవులో ఉంటారు. తిరిగి ఈ నెల 26న విధులకు హాజరవుతారని కలెక్టరేట్ అధికార వర్గాలు తెలిపారు. అప్పటి వరకు జాయింట్ కలెక్టర్ శివ నారాయణ శర్మ ఇన్‌చార్జ్ కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తారు.

గోదాములో స్టాక్ పరిశీలన

తాడిపత్రి రూరల్: స్థానిక చిన్నపొలమడ వద్ద ఉన్న రైస్ గోదామును గురువారం ఉదయం పౌరసరఫరాల జిల్లా మేనేజర్ రమేష్‌రెడ్డి తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్, బియ్యం బస్తాల్లో తక్కువ తూకాలపై అందిన ఫిర్యాదులనూ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తూకాలు సరి చూసుకున్న తర్వాతనే బియ్యం బస్తాలను డీలర్లు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ సెంటర్లకు సరఫరా చేసిన కంది బేడలు ముద్దగా ఉన్న విషయం తనకు తెలియదన్నారు. సెంటర్ల వారీగా వివరాలు అందిస్తే వాటిని స్వాధీనం చేసుకుని డీలర్ల ద్వారా కొత్త వాటిని అందజేస్తామన్నారు. ప్రీ స్కూల్ బియ్యం, మూడు కిలోల బియ్యం ప్యాకెట్ల కొరతపై కూడా ఐసీడీఎస్ అధికారులు తమ దృష్టికి తీసుకురాలేదన్నారు. గోదాము వద్దకు అంగన్‌వాడీ టీచర్లు వచ్చి సరుకులు తీసుకెళ్లాల్సిన అవసరం లేదని, డీలర్లే ఆయా సెంటర్లకు చేరవేస్తారన్నారు.

గోదాము అధికారులు స్పందించరు

అంగన్‌వాడీ సెంటర్లకు అరకొరగా సరఫరా చేసిన ప్రీ స్కూల్ బియ్యం, ముద్ద కట్టిన కంది బేడల అంశాన్ని గోదాము అధికారి దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందని సీడీపీఓ సాజిదాబేగం ఆవేదన వ్యక్తం చేశారు. తక్కువగా వచ్చిన సరుకులపై ప్రాజెక్ట్ పరిధిలోని సూపర్‌వైజర్లతో మాట్లాడనన్నారు. వారిలో కొందరు స్వయంగా గోదాము వద్దకెళ్లి ఫిర్యాదు చేసిన స్పందించకపోగా దురుసుగా వ్యవహరించారంటూ మండిపడ్డారు. ఆయా సెంటర్లకు తక్కువగా వచ్చిన సరుకుల వివరాలను వెంటనే తన దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

అక్రమార్జన బాట పట్టిన టీడీపీ నాయకులు ఆదాయం తెచ్చిపెడుతుందనే ఏ మార్గాన్నీ వదలడం లేదు. తాజాగా టిడ్కో ఇళ్లపై కన్నేశారు. అర్హులైన లబ్ధిదారులను మార్చారని, గతంలో తమ ప్రభుత్వం ఎంపిక చేసిన వారికే ఇళ్లు కేటాయిస్తామంటూ పైకి డ్రామా ఆడుతూ ఆ మాటున రూ.కోట్లలో సొమ్ము చేసుకునేందుకు భారీ స్కెచ్ వేసినట్లు తెలిసింది.

కాసుల కక్కుర్తి.. టిడ్కో ఇళ్లపై దృష్టి



వైఎస్సార్ సీపీ హయాంలో సుందరంగా రూపుదిద్దుకున్న ఇళ్ల సముదాయం

- టిడ్కో ఇళ్ల లబ్ధిదారుల నుంచి డబ్బు దండుకునే ఎత్తుగడ
- లబ్ధిదారులను మార్చారన్న సాకుతో గుట్టుగా వ్యవహారం
- 2019కి ముందు ఎంపిక చేసిన లబ్ధిదారులే ఇప్పుడూ..
- టీడీపీ హయాంలో పునాది స్థాయిలోనే ఇళ్ల నిర్మాణాలు
- రూ.99.94 కోట్లతో పూర్తి చేసిన గత వైఎస్సార్ సీపీ సర్కారు

టిడ్కో ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ	2018 టీడీపీ ప్రభుత్వం
టీడీపీ హయాంలో జరిగిన యూనిట్లు	96 యూనిట్లు
వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రివర్స్ టెండర్ ద్వారా ఇళ్ల నిర్మాణానికి కేటాయించిన మొత్తం	రూ.99.94 కోట్లు
వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మొత్తం లబ్ధిదారుల సంఖ్య	2,304
రూఫ్ లెవెల్ స్థాయి చేరిన యూనిట్ల సంఖ్య	1,776



గతంలో టీడీపీ ప్రభుత్వం దిగిపోయేనాటికి అసంపూర్తిగా ఉన్న టిడ్కో ఇళ్లు

అనంతపురం కార్పొరేషన్: టీడీపీ ప్రభుత్వంలో పునాది స్థాయిలో ఉన్న ఇళ్లను గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం రూ.99.94 కోట్లతో బహుళ అంతస్తుల స్థాయికి తీసుకువచ్చింది. 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో షాపూర్ జీ పల్లోంజి అనే కాంట్రాక్టర్ నగర శివారులోని పండమేరు వద్ద 50 ఎకరాల్లో టిడ్కో ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని నిర్ణయించారు. 2018 జూన్ 6న అగ్రిమెంట్ చేసుకుని, అదే ఏడాది ఆగస్టు 9న నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. అయితే, అప్పట్లో సదరు కాంట్రాక్టర్ ఇళ్ల నిర్మాణ పనుల్లో చాలా జాప్యం చేశారు. ఈ క్రమంలోనే ప్రభుత్వం మారిపోయింది. అప్పటికి 10 శాతం పనులు కూడా పూర్తి కాలేదు. 2019లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాగానే 25 శాతం కూడా పూర్తి కాని ఇళ్ల పనులకు రివర్స్ టెండర్ పిలిచారు. పేద ప్రజలకు సొంతింటి కల సాకారం చేయాలన్న సంకల్పంతో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రూ.99.99 కోట్లతో 2,304 ఇళ్ల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. అందులో 2,112 ఇళ్లు 300 చదరపు అడుగులు, 48 ఇళ్లు 365 చదరపు అడుగులు, 144 ఇళ్లు 430 చదరపు అడుగల మేర నిర్మాణం చేపట్టాలని నిర్ణయించగా.. కాంట్రాక్ట్‌ను ఎం/ఎస్ డీఎస్ మాక్స్ ప్రాపర్టీస్ దక్కించుకుంది. వేగంగా పనులు చేపట్టి టీడీపీ హయాంలో పునాది స్థాయిలో ఉన్న ఇళ్ల నిర్మాణాలను బహుళ అంతస్థుల స్థాయికి తీసుకెళ్లారు. మొత్తం 2,304 యూనిట్లలో 1,776 యూనిట్లు రూఫ్ లెవెల్ స్థాయిలో ఉన్నాయి. వీటితో పాటు 300 చదరపు అడుగుల ఇళ్లకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు కేవలం రూపాయితో రిజిస్ట్రేషన్ చేయించేలా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుని 2021 మార్చి 23న జీఓను విడుదల చేసింది.

పక్కా ప్రణాళికతోనే అసత్యాలు..

వాస్తవాలు ఇలా ఉంటే.. ఇటీవల పండమేరులో జీప్లస్ 3 స్థాయిలో ఉన్న టిడ్కో ఇళ్లను పరిశీలించిన ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ ఇంకోలా మాట్లాడటం గమనార్హం. గత ఐదేళ్లలో టిడ్కో ఇళ్ల లబ్ధిదారుల మారారు కానీ, 80 శాతం పనులు టీడీపీ హయాంలోనే జరిగాయని సెలవిచ్చారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఒక్క ఇంచి పనులు కాలేదని, లబ్ధిదారులను మార్చారని ఆరోపించారు. అర్హులైన లబ్ధిదారులను చేర్చుతామని తెలిపారు. అయితే, టీడీపీ హయాంలో ఎంపిక చేసిన లబ్ధిదారుల్లో గత ప్రభుత్వం ఒక్కరిని కూడా మార్చలేదు. 2,304 మంది లబ్ధిదారుల జాబితా నగరపాలక సంస్థలో ఇప్పటికీ ఉంది. కానీ, అసత్య ప్రచారాలు చేసి ఇళ్ల లబ్ధిదారుల నుంచి డబ్బు దండుకోవాలనే పక్కా ప్రణాళికతో ప్రజాప్రతినిధి మాట్లాడారని పలువురు ఆరోపిస్తున్నారు. అలాగే, కొత్త వారికి ఇళ్లు కేటాయించి భారీగా లబ్ధి పొందేందుకు ఎత్తుగడ వేసినట్లు టీడీపీకి చెందిన నాయకులే చెబుతున్నారు.

దుష్ప్రచారం తగదు..



టిడ్కో ఇళ్ల నిర్మాణాలపై టీడీపీ దుష్ప్రచారం చేస్తోంది. టీడీపీ ప్రభుత్వంలో పట్టుమని 10 శాతం ఇళ్ల నిర్మాణాలు జరగలేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక చొరవతో 85 శాతం పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకున్నాం. 300 చదరపు అడుగులకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల్లో ఒక్కొక్కరు రూ.2.50 లక్షలు చెల్లించాలని టీడీపీ ప్రభుత్వం నిర్ణయించినా.. తమ ప్రభుత్వంలో పేదలకు ఉచితంగా అందించాలని కేవలం రూపాయితో రిజిస్ట్రేషన్ చేయించేలా చర్యలు తీసుకున్నాం.

– అనంత వెంకటరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే

పెండింగ్ మెస్, కాస్మోటిక్ చార్జీలు విడుదల చేయాలి



మాట్లాడుతున్న ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జాన్సన్‌బాబు

అనంతపురం ఎడ్యుకేషన్: హాస్టల్ విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మోటిక్ చార్జీలు వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వి.జాన్సన్‌బాబు డిమాండ్ చేశారు. ప్రభుత్వ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ గురుకులాలు, కేజీబీవీ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 27, 28, 29 తేదీల్లో కలెక్టరేట్ ఎదుట రిలే నిరాహార దీక్షలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. గురువారం సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రమణయ్య, కుళ్లాయిస్వామితో కలసి ఆయన మాట్లాడారు. ప్రభుత్వ హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పాతబడిన ప్రభుత్వ హాస్టల్ భవనాల స్థానంలో కొత్త వాటిని నిర్మించాలన్నారు. జిల్లాలో గోనబావి, కుందుర్పి, ముదినాయనిపల్లి ప్రాంతాల్లో అర్ధంతరంగా ఆపేసిన గురుకుల పాఠశాలల భవనాల నిర్మాణాలను వెంటనే పూర్తి చేసేలా చూడలన్నారు. సమావేశంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కోశాధికారి హనుమంతు, నాయకులు వెంకట్ నాయక్, ఆంజనేయులు, వంశీ, మంజునాథ్ ఉమా మహేష్, చందు, వినోద్ పాల్గొన్నారు.

సొంత పార్టీ వారే దాడి చేశారు

- టీడీపీ నేత చింతకాయల రవి ఆవేదన
- ఫిర్యాదు చేసినా కేసు నమోదుకు వెనుకాడిన పోలీసులు
- పోలీసు స్టేషన్ ఎదుట నిరసన



పోలీసు స్టేషన్ ఎదుట నిరసన తెలుపుతున్న టీడీపీ నేత రవి, ఆయన కుటుంబసభ్యులు

యాడికి: 'గొడవలు వద్దు.. గ్రామంలో ప్రశాంత వాతావరణానికి భంగం కలిగించొద్దు' అంటూ ఘర్షణను అడ్డుకోబోయిన తనపై సొంత పార్టీ వారే విచక్షణారహితంగా దాడి చేశారంటూ టీడీపీ నేత చింతకాయల రవి వాపోయాడు. ఈ నెల 15న యాడికి మండలం బోయరెడ్డిపల్లిలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై టీడీపీ నేతలు దాడికి ప్రయత్నించారు. ఆ సమయంలో టీడీపీ నేతలను చింతకాయల రవి అడ్డుకున్నాడు. దాడుల సంస్కృతి వీడాలని, గ్రామ ప్రశాంతతను కాపాడుకుందామని హితవు పలికాడు. దీంతో టీడీపీ నేతలు నగేష్, పెద్దయ్య, హరి, చిన్న కొత్తరాయుడు, రామకృష్ణ, ఓబులేసు ఆగ్రహంతో రెచ్చిపోయారు. సొంత పార్టీకి చెందిన వాడని కూడా చూడకుండా చింతకాయల రవిని విచక్షణారహితంగా చితకబాదారు. ఘటనలో తీవ్రంగా గాయపడిన రవిని కుటుంబసభ్యులు వెంటనే తాడిపత్రిలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స అనంతరం గురువారం యాడికి పోలీస్ స్టేషన్‌కు చేరుకుని తనపై జరిగిన దాడికి సంబంధించి ఫిర్యాదు చేసేందుకు బాధితుడు ప్రయత్నించాడు. అయితే కేసు నమోదుకు పోలీసులు సహకరించకపోవడంతో కుటుంబసభ్యులతో కలసి పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టాడు. విషయం తెలుసుకున్న సీఐ వీరన్న... బాధితులను పిలిపించుకుని మాట్లాడారు. రెండు రోజుల క్రితమే తాను బాధ్యతలు స్వీకరించానని, ఘటనపై విచారించి న్యాయం చేస్తానని భరోసానివ్వడంతో ఆందోళనను విరమించారు.

వివాహిత బలవన్మరణం



సునీత మృతదేహం

గుత్తి రూరల్: జీవితంపై విరక్తితో ఓ వివాహిత సునీత(34) ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు... గుత్తి మండలం తురకపల్లికి చెందిన రైతు వెంకటేశ్వరరెడ్డి, సునీత దంపతులు. వీరికి ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. మూడేళ్లుగా మానసిక స్థితి సరిగా లేని సునీతకు కుటుంబసభ్యులు చికిత్స చేయిస్తున్నారు. గురువారం కుటుంబసభ్యులందరూ గుత్తిలో జరిగిన ఓ వివాహ వేడుకకు వెళ్లారు. ఆ సమయంలో ఇంట్లో ఒంటరిగా ఉన్న సునీత... క్రిమి సంహారక మందు తాగింది. ఆలస్యంగా ఇంటికి చేరుకున్న వెంకటేశ్వరరెడ్డి... ఓ మూలన అపస్మారక స్థితిలో పడి ఉన్న భార్యను గమనించి వెంటనే గుత్తిలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లాడు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. ఎస్‌ఐ నబీరసూల్... కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

మద్యం విక్రేతల అరెస్ట్

గుత్తి రూరల్: మండలంలోని బాచుపల్లి గ్రామ శివారులో 44వ జాతీయ రహదారిపై బాట సుంకులమ్మ ఆలయం ఎదురుగా ఉన్న దుకాణాల్లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. ఈ మేరకు సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ నబీరసూల్ తెలిపారు. కొన్ని రోజులుగా ఆలయం ఎదుట ఎలాంటి అనుమతుల్లేకుండా అధిక ధరలకు మద్యాన్ని విక్రయిస్తున్నట్లుగా పోలీసులకు సమాచారం అందింది. దీంతో గురువారం ఉదయం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో మద్యం విక్రయిస్తున్న రామ్మోహన్, మునీంద్రను అరెస్ట్ చేసి, 20 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. న్యాయమూర్తి ఆదేశాల మేరకు నిందితులను రిమాండ్‌కు తరలించారు.

పాఠశాల నుంచి వెళ్లిపోయిన ముగ్గురు విద్యార్థులు

- 24 గంటల్లోపు ఆచూకీ గుర్తింపు
- కుటుంబసభ్యులకు అప్పగించిన పోలీసులు

గార్లదిన్నె: స్థానిక ముస్లిం మైనారిటీ గురుకుల పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థులు తప్పించుకుని వెళ్లారు. విషయాన్ని తెలుసుకున్న పోలీసులు 24 గంటల్లోపు వారిని గుర్తించి, సురక్షితంగా తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. వివరాలను గురువారం గార్లదిన్నె పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ కౌలుట్లయ్య వెల్లడించారు. ముస్లిం మైనారిటీ గురుకుల పాఠశాలలో 8వతరగతి చదువుతున్న అల్తాఫ్, షేక్ ఇర్ఫాన్, నౌషాద్ బుధవారం మధ్యాహ్నం ఎవరికీ చెప్పకుండా పాఠశాల నుంచి బయటికి వెళ్లిపోయారు. సాయంత్రం రోల్‌కాల్ సమయంలో వారు తప్పించుకుపోయిన విషయాన్ని గుర్తించిన యాజమాన్యం వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ గౌస్ మహమ్మద్ బాషా ఆధ్వర్యంలో పోలీసులు ఆరు బృందాలుగా విడిపోయి గాలింపు చేపట్టారు. గురువారం తెల్లవారుజామున అనంతపురంలోని కళ్యాణదుర్గం రోడ్డులోని రజాక్ ఫంక్షన్ హాల్ వద్ద తచ్చాడుతున్న విద్యార్థులను గస్తీ పోలీసులు గుర్తించి, సమాచారం ఇవ్వడంతో గార్లదిన్నె పోలీసులు అక్కడకు చేరుకుని విద్యార్థులను తమ ఆధీనంలోకి తీసుకున్నారు. అనంతరం ఐసీడీఎస్ అధికారుల సమక్షంలో విద్యార్థులను తల్లిదండ్రులకు అప్పగించి కౌన్సిలింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో మైనారిటీ వెల్ఫేర్ ఆఫీసర్ రామసుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ ఆంజనేయులు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

కరెంట్ కోసం రైతుల ధర్నా



సబ్ స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న మర్తాడు రైతులు

గార్లదిన్నె: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద గురువారం సాయంత్రం మర్తాడు రైతులు ఆందోళన చేశారు. రైతులు మాట్లాడుతూ మర్తాడు సబ్ స్టేషన్ పరిధిలో కొత్తపల్లి ఫీడర్‌కు వర్షం కారణంగా విద్యుత్ స్తంభాలు విరిగి, తీగలు తెగిపోయాయన్నారు. దీంతో కరెంట్ సరఫరాకు అంతరాయం ఏర్పడిందన్నారు. విద్యుత్ శాఖ అధికారులు మరమ్మతులు చేయకపోవడంతో వారం రోజులుగా పంటలకు విద్యుత్ సరఫరా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. మండలానికి ఏఈ లేకపోవడంతో డీఈకి సమస్యను విన్నవించుకున్నా మెటీరియల్ లేదని సమాధానం చెబుతున్నారన్నారు. వెంటనే విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

తాడిపత్రిలో బందోబస్తు పర్యవేక్షించిన ఏఎస్పీ



డీఎస్పీ, సీఐలతో చర్చిస్తున్న అదనపు ఎస్పీ రమణమూర్తి

తాడిపత్రి అర్బన్: తాడిపత్రిలో బందోబస్తును జిల్లా అదనపు ఎస్పీ డీవీ రమణమూర్తి పర్యవేక్షించారు. గురువారం అర్బన్ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న అదనపు ఎస్పీ రమణమూర్తి తాడిపత్రి అల్లర్లకు గల కారణాలను సిబ్బందితో అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైఎస్సార్ సీపీ నాయకుడు కందిగోపుల మురళీప్రసాద్‌రెడ్డి నివాసాన్ని పరిశీలించారు. ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి నివాసాలను కూడా పరిశీలించారు. పట్టణంలోని 29 ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పికెట్లను తనిఖీ చేసి సిబ్బందికి సూచనలిచ్చారు. తాడిపత్రిలో ప్రశాంతత లోపించకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

29న మారథాన్ : డీఎంహెచ్ఓ

అనంతపురం మెడికల్: అంతర్జాతీయ యువజనోత్సవాన్ని పురస్కరించుకుని హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించడంలో భాగంగా ఈ నెల 29న 5కే మారథాన్ నిర్వహించనున్నట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ భ్రమరాంబదేవి తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను గురువారం తన చాంబర్‌లో ఆమె ఆవిష్కరించి, మాట్లాడారు. వచ్చే గురువారం ఉదయం 6.30 గంటలకు మారథాన్ ప్రారంభమవుతుందన్నారు. ఆర్ట్స్ కళాశాల నుంచి టవర్‌క్లాక్, సప్తగిరి సర్కిల్, సర్వజనాస్పత్రి, కోర్టు రోడ్డు మీదుగా తిరిగి ఆర్ట్స్ కళాశాలకు చేరుతుందన్నారు. విజేతలకు నగదు పారితోషికం ప్రదానం చేస్తామన్నారు. పూర్తి వివరాలకు డీఎంహెచ్ఓ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ అనుపమ జేమ్స్, పీఓడీటీ డాక్టర్ సుజాత, క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ భాస్కర్, సూపర్‌వైజర్ రమణ, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక డంప్‌ల సీజ్

తాడిపత్రి అర్బన్: స్థానిక శ్రీనివాసపురం, నందలపాడులోని ఇసుక డంప్‌లను పోలీసులు సీజ్ చేశారు. పెన్నానది నుంచి అక్రమంగా ఇసుకను తరలించి నందలపాడు, శ్రీనివాసపురంలో అక్రమంగా నిల్వ చేసినట్లు గుర్తించిన మైన్స్ అండ్ జియాలజీ, రెవెన్యూ అధికారులు గురువారం అక్కడకు చేరుకుని పరిశీలించారు. అధికారుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, సీజ్ చేశారు.

జేఎన్‌టీయూకు ఐఎస్ఓ గుర్తింపు

అనంతపురం సెంట్రల్: జేఎన్‌టీయూకు ఐఎస్ఓ గుర్తింపు లభించింది. గురువారం యూనివర్సిటీ కాన్ఫరెన్స్ హాలులో సర్టిఫికేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ ఆచార్య సుదర్శన్‌రావు మాట్లాడుతూ జేఎన్‌టీయూకు ఐఎస్ఓ సర్టిఫికెట్ రావడం గర్వకారణమన్నారు. భవిష్యత్తులో నాణ్యత ప్రమాణాలు కొనసాగిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్‌వైఎం ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్ ప్రైవేటు లిమిటెడ్ ప్రతినిధి ఆలపాటి శివయ్య, రిజిస్ట్రార్ ఆచార్య కృష్ణయ్య, ఓటీపీఆర్ఐ డైరెక్టర్ ఆచార్య దుర్గాప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి, ఎంబీఏ విభాగాధిపతి నారాయణరెడ్డి పాల్గొన్నారు.

జూనియర్ సివిల్ జడ్జిగా కృష్ణవేణి

తాడిపత్రి అర్బన్: తాడిపత్రి జుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్‌గా కృష్ణవేణి గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ జడ్జిగా పనిచేస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి నాలుగు నెలలక్రితం వైఎస్సార్ జిల్లా పులివెందులకు బదిలీ అయిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో తాడిపత్రి జూనియర్ సివిల్ జడ్జిగా కృష్ణవేణి నియమితులయ్యారు.

రెండో రోజూ న్యాక్ బృందం పరిశీలన



మాట్లాడుతున్న న్యాక్ పీర్ కమిటీ చైర్మన్ లింబాద్రి

కళ్యాణదుర్గం రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలను రెండో రోజూ న్యాక్ బృందం పరిశీలించింది. కళాశాలకు న్యాక్ గ్రేడ్ నిర్ణయించేందుకు నియమించిన త్రిసభ్య కమిటీ చైర్మన్ ఆచార్య లింబాద్రి, మెంబర్ కో–ఆర్డినేటర్ ఆచార్య బుడిన్ గోగాయి, ఆచార్య శ్రీప్రభుచప్కే గురువారం ఉదయం కళాశాల క్రీడాభివృద్ధి, జాతీయ సేవా పథకం కార్యకలాపాలు, నాలెడ్జి సెంటర్, మౌలిక వసతులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కళాశాల మరింత అభివృద్ధి చేపట్టాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జయరాం రెడ్డి, న్యాక్ కోర్డినేటర్ సూర్యనాగిరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ శేషయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

బావిలో పడి వ్యక్తి మృతి

కుందుర్పి: బావిలో పడి ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... కుందుర్పికి చెందిన రంగప్ప (59)కు ఇద్దరు భార్యలు, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొంత కాలంగా మతిస్థిమితం లేక ఇబ్బంది పడుతున్న ఆయన గురువారం ఆ గ్రామ శివారులోని బెస్తవారి బావిలో కాళ్లు శుభ్రం చేసుకునేందుకు దిగుతుండగా అదుపు తప్పి నీళ్లలో పడి మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

క్లుప్తంగా

ఇంజినీరింగ్ కళాశాలల వైస్ ప్రిన్సిపాల్‌గా వసుంధర



వైస్ ప్రిన్సిపాల్ వసుంధరకు శుభాకాంక్షలు చెబుతున్న దృశ్యం

అనంతపురం సెంట్రల్: ఇంజినీరింగ్ కళాశాలల వైస్ ప్రిన్సిపాల్‌గా ఆచార్య ఎస్.వసుంధర గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇన్‌చార్జ్ వీసీ సుదర్శన రావు, రిజిస్ట్రార్ కృష్ణయ్య తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించారని తెలిపారు. సక్రమంగా విధులు నిర్వహిస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమెకు పలువురు డైరెక్టర్లు, బోధన, బోధనేతర సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

పోలీసులో అదుపులో బైక్ దొంగ

కనగానపల్లి: మండలంలోని సోమరవాండ్లపల్లిలో ద్విచక్ర వాహనాన్ని (బైక్) తీసుకెళ్తున్న ఓ దొంగను కనగానపల్లి పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. స్థానిక గ్రామస్తులు తెలిపిన వివరాలు.. బుధవారం రాత్రి గ్రామంలోని కుమ్మరి నాగేంద్ర అనే వ్యక్తి ఇంటి వద్ద నిలిపిన బైక్‌ను తీసుకెళ్లేందుకు దొంగలు ప్రయత్నించారు. ఇంతలో చుట్టు పక్కల వారు గమనించి దొంగలను వెంబడించారు. వారిలో ఓ దొంగను పట్టుకున్నారు. తర్వాత పోలీసులకు సమాచారం అందించి దొంగను పోలీసులకు అప్పగించినట్లు సమాచారం. కాగా గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో బాధితుడు నాగేంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు బైక్ దొంగల కోసం గాలిస్తున్నట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు.

ఆలోచింపజేసే లఘుచిత్రం 'బాల్యం'



ఓ సన్నివేశాన్ని చిత్రీకరిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: అనంతకు చెందిన చిత్ర దర్శకుడు తరిమెల రాజు మరో ఆలోచనాత్మక చిత్రాన్ని నిర్మిస్తున్నారు. గత ఐదు రోజులుగా జిల్లా కేంద్రంతో పాటూ కాట్నేకాలువ ఆశ్రమ అనాథాశ్రమంలో షూటింగ్ జరుపుకున్న 'బాల్యం' లఘు చిత్రం గురువారం చిత్రీకరించిన సన్నివేశాలతో ముగిసిందని దర్శక నిర్మాతలు తెలిపారు. తరిమెల రాజు, నిర్వాహకులు గీతాంజలి కేపీ రాజు, కమలనాథ్ తదితరులు మాట్లాడుతూ.. బాల్య వివాహాల నిర్మూలనే లక్ష్యంగా చైతన్యవంతం చేసే చిత్రాన్ని నిర్మించామన్నారు. ఇందులో జిల్లాకు చెందిన 18 మంది కళాకారులతో పాటూ అధిక సంఖ్యలో చిత్ర యూనిట్ సభ్యులు పని చేశారని పేర్కొన్నారు. 1098 సిబ్బందితో బాలల హక్కులు వారి పరిరక్షణ అనే అంశాలతో కూడిన చిత్రాన్ని త్వరలో విడుదల చేస్తామన్నారు. కార్యక్రమంలో పవన్ లింగాల, సాకే హరి, శంకరరెడ్డి, సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

'సైమన్ పీటర్‌కు ట్రస్టుతో సంబంధం లేదు'

అనంతపురం టవర్‌క్లాక్: ది సొసైటీ ఆఫ్ ట్రస్టీస్ ఆఫ్ ఇండిజినస్ చర్చి కాల క్రమేనా ట్రస్టుగా రూపాంతరం చెందింది. దీనికి సైబన్ పీటర్, వీరాచారికి ఎలాంటి సంబంధం లేదని ట్రస్ట్ అధీకృత నిర్వాహకుడు శామ్యూల్ జకర్య తెలిపారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. రామచంద్ర నగర్‌లో ఉన్న చర్చికి ఫాదర్‌గా ఉన్న దైవదాసులు అలియాస్ విక్టర్ డేవిడ్‌ను బలవంతంగా గృహంలో నిర్బంధించి దాడి చేశారన్నారు. ఆయనపై దాడి చేసి చర్చిని వారి పేరుతో రాయించుకున్నారని నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. దాడికి పాల్పడిన సైమన్ పీటర్, చింతా సత్యం, పుల్లయ్య, రాగి వీరాచారిని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. వీరిపై గతంలో వివిధ నేరాల్లో కేసులు నమోదైనట్లు గుర్తు చేశారు. వారి నుంచి రక్షణ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో విజయ్, కొప్పల పాల్, కిరణ్, మురళీమోహన్, నవీన్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక సేవలతోనే ఆనందం



నూతన భవనానికి భూమిపూజ చేస్తున్న శివరుద్ర స్వామీజీ

అనంతపురం కల్చరల్: ఆధ్యాత్మిక సేవలతోనే మనిషికి సంపూర్ణ ఆరోగ్యం, ప్రశాంతత లభిస్తాయని శివబాలయోగి ఆశ్రమ సెంట్రల్ ట్రస్టు చైర్మన్ శివరుద్ర స్వామీజీ అన్నారు. అనంతలో నూతనంగా రూపుదిద్దుకుంటున్న శివబాలయోగి ఆశ్రమ భవనానికి గురువారం భూమిపూజ చేశారు. తొలుత డెహరాడూన్ నుంచి అనంతకు విచ్చేసిన స్వామీజీకి ఆశ్రమంలో వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామీజీ స్వయంగా ఆశ్రమంలో వెలసిన బాలయోగి సద్గురువులు, అనంతేశ్వరుడికి స్వయంగా అభిషేకం చేశారు. సాయి ట్రస్టు ఆధ్వర్యంలో సెప్టెంబర్ 14న తిరుమల తరహా సాగే ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఆశ్రమ కమిటీ అధ్యక్షుడు జూటూరు అరవింద్, రత్నగిరి దేవరాజ్, సాయిట్రస్టు విజయ్ కుమార్, రాఘవేంద్ర పాల్గొన్నారు.

ఆదరణ కోల్పోయి.. అనాథలుగా మిగిలి

వైద్యం కోసం ప్రభుత్వ సర్వజనాస్పత్రికి వచ్చిన వృద్ధులు అభాగ్యులుగా మిగిలిపోతున్నారు. మరికొంత మంది అనారోగ్యానికి గురైన వారిని కనీసం కనికరం లేకుండా అక్కడే వదిలేసి వెళ్లిపోతున్నారు. రాత్రనక, పగలనక వర్షం వచ్చి దోమలు కుడుతున్నా వృద్ధులు, అనాథలను పట్టించుకునే వారు లేరు. దుర్వాసన వెదజల్లుతున్నా.. అనారోగ్యంతో ఇబ్బందులు పడుతూ ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో తలదాచుకుంటున్నారు. ఆపన్నహస్తం అందించే వారి కోసం దీనంగా ఎదురు చూస్తున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:



ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ఆవరణలో తలదాచుకుంటున్న వృద్ధులు



అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వృద్ధురాలు



అనాథగా మిగిలిపోయిన మహిళ



కుటుంబ సభ్యుల కోసం ఎదురుచూపులు

వైద్య విద్యార్థులకు భద్రత పెంచాలి

అనంతపురం మెడికల్: కోల్‌కత్తాలో జరిగిన ఘటన మరో ప్రాంతంలో పునరావృతం కాకుండా పీజీ వైద్య విద్యార్థులకు భద్రత పెంచేలా చర్యలు తీసుకోవాలని అనంతపురం అబ్‌స్టెట్రిక్ గైనకాలజీ అసోసియేషన్ నాయకురాళ్లు కోరారు. గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. మౌలిక సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. 24 గంటల పాటు క్యాంటీన్, సీసీ కెమెరాలు, తరచూ తనిఖీలు నిర్వహించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏఓజీఎస్ నాయకురాళ్లు డాక్టర్ అరుణ, డాక్టర్ నిస్సీ వినూత్న, డాక్టర్ ప్రసూన తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏఓజీఎస్ నాయకురాళ్లు

పన్ను వసూళ్లు వేగవంతం చేయాలి

అనంతపురం కార్పొరేషన్: నగరంలో ఇంటి, నీటి, ఖాళీ జాగా పన్ను వసూళ్లను వేగవంతం చేయాలని అదనపు కమిషనర్ శ్రీహరిబాబు, డిప్యూటీ కమిషనర్ వెంకటేష్ సిబ్బందికి సూచించారు. గురువారం నగరపాలక సంస్థలో రెవెన్యూ సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రధానంగా మొండి బకాయిదారులపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. పన్ను చెల్లించని వారికి నోటీసులు జారీ చేయాలన్నారు. నగరపాలక సంస్థకు చెందిన షాపుల అద్దెలను వసూళ్లు చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్‌ఓలు సతీష్, సుజాత, ఆర్‌ఐలు మురళీ, వేణుగోపాల్, బాబు, సునీల్, తదితరులు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల్లో ముందస్తు చర్యలు

ముంపు ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని అదనపు కమిషనర్ శ్రీహరిబాబు సిబ్బందిని ఆదేశించారు. గురువారం వరదలు వచ్చిన రజకనగర్, సోమనాథ్‌నగర్, బాలాజీ నగర్, తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఫాగింగ్, స్ప్రేయింగ్ చేయించేలా చర్యలు తీసుకోవాలని ఎంహెచ్ఓ డాక్టర్ విష్ణుమూర్తిను ఆదేశించారు.



రెవెన్యూ సిబ్బందితో సమావేశమైన అదనపు కమిషనర్, డీసీ

మామపై అల్లుడి దాడి

తాడిపత్రి అర్బన్: భార్యను కాపురానికి పంపలేదన్న కోపంతో మామపై అల్లుడు దాడి చేసిన ఘటన పట్టణంలో చోటు చేసుకుంది. అర్బన్ సీసీఐ నాగేంద్ర ప్రసాద్ కథనం మేరకు.. గన్నెవారిపల్లి కాలనీకి చెందిన సంబుదాస్ కూతురు మమతను మూడేళ్ల క్రితం యాడికి మండలం నగరూరుకు చెందిన చిరంజీవికి ఇచ్చి వివాహం చేశారు. భర్త అదనపు కట్నం కోసం వేధిస్తుండడంతోమమత తాడిపత్రిలోని పుట్టినింటికి వచ్చింది. ఈ విషయమై పలు మార్లు పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ కూడా చేశారు. అయితే గురువారం సాయంత్రం సంబుదాస్ నంద్యాల రోడ్డులో ఉండగా అక్కడికి చేరుకున్న అల్లుడు చిరంజీవి తన భార్యను పుట్టినింటికి పంపించాలని వాగ్వాదానికి దిగాడు. ఆయన ఒప్పుకోకపోవడంతో చిరంజీవి తన వెంట తెచ్చుకున్న కొడవలితో దాడి చేశాడు. గాయపడ్డ సంబుదాస్‌ను స్థానికులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అర్బన్ సీఐ తెలిపారు.

కారు బోల్తా

పెద్దపప్పూరు: మండలంలోని చాగల్లు గ్రామ సమీపంలో గురువారం ఓ కారు బోల్తాపడింది. వివరాలు.. ధర్మవరం పట్టణం కేశవనగర్‌కు చెందిన జయక్రిష్ణ, జయలక్ష్మి దంపతులు కారులో పెద్దపప్పూరు మండలం నరసాపురంలో జరిగే ఓ నిశ్చితార్థ వేడుకకు బయలుదేరారు. చాగల్లు వద్ద పశువులు ఎదురుగా రావడంతో తప్పించబోయి కారు బోల్తాపడింది. స్థానికులు వెంటనే వారిని రక్షించారు. వారికి ఎలాంటి గాయాలు కాలేదని ఎస్ఐ గౌస్‌బాషా తెలిపారు.

తేనెటీగల దాడిలో కూలీకి గాయాలు

గుత్తి రూరల్: మండలంలోని పూలకుంట గ్రామానికి చెందిన మల్లికార్జున అనే వ్యవసాయ కూలీ గురువారం తేనెటీగల దాడిలో తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. మల్లికార్జున మరి కొందరు కూలీలతో కలసి గ్రామ శివారులోని పంట పొలాల్లో కూలీ పనులకు వెళ్లాడు. సమీపంలోని పెద్ద తేనెటీగలు ఒక్కసారిగా అతడిపై దాడి చేశాయి. మొహం, వీపు, ఛాతీ, చేతులపై గాయాలవడంతో తోటి కూలీలు వెంటనే అతడిని గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు అతడిని అనంతపురానికి తరలించారు.

బాలిక అదృశ్యంపై కేసు

గార్లదిన్నె: మండలంలోని ఇల్లూరుకు చెందిన ఓ బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా గురువారం తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు.. గ్రామానికి చెందిన శ్రీనివాసులు కుమార్తె భావన(17) తాడిపత్రి సీవీరామన్ కాలేజీలో డిప్లమా ద్వితీయ సంవత్సరం చదువుతోంది. నెల రోజుల నుంచి ఇల్లూరులో ఇంటి వద్దే ఉంటోంది. మంగళవారం ఉదయం తల్లిదండ్రులు వ్యవసాయ పనులకు వెళ్లగా బాలిక ఇంటి నుంచి బయటికి వెళ్లిపోయింది. సాయంత్రం అయినా ఇంటికి రాకపోవడంతో.. చుట్టుపక్కల ప్రాంతాలు, బంధువుల ఊర్లలో వెతికినా బాలిక ఆచూకీ లభ్యం కాలేదు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

రోడ్డుపై గుంత.. వాహనదారుల చింత

ఆత్మకూరులోని ప్రధాన రహదారి మధ్యలో పెద్ద గుంత ఏర్పడింది. బస్టాండ్ ఎదురుగా ఉన్న ప్రధాన రహదారిలో అండర్ డ్రైనేజీ పైపు వెళ్లడంతో రోడ్డు మధ్యలో పైపు పగిలిపోయింది. దీంతో రోడ్డు మధ్యలో పెద్ద గుంత పడింది. ఆ గుంత ప్రమాదకరంగా ఉందంటూ పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. ద్విచక్ర వాహనాలు గుంతలో ఇరుక్కుని ప్రమాదాలు కూడా చోటుచేసుకున్నాయి. ఇక రాత్రి సమయాల్లో అయితే గుంత కనిపించక పోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. చిన్న పిల్లలు పొరపాటున ఆ గుంతలో పడితే అంతే సంగతులు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. – ఆత్మకూరు:



ఆత్మకూరులో బస్టాండ్ ఎదురుగా రోడ్డు మధ్యలో ప్రమాదకరంగా ఉన్న గుంత

నోటికొచ్చినట్లు మాట్లాడతారా?

- ఎమ్మెల్యే దగ్గుపాటి వాస్తవ పరిస్థితులను తెలుసుకోవాలి
- మేయర్ వసీం



అనంతపురం కార్పొరేటర్: ఎమ్మెల్యే దగ్గుపాటి వాస్తవ పరిస్థితులను తెలుసుకుని మాట్లాడాలని మేయర్ వసీం హితవు పలికారు. గురువారం మేయర్ తన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే అనంతపురం గురించి ఇంకా పూర్తిగా అవగాహన చేసుకున్నట్లు లేరన్నారు. గతంలో ఏమి జరిగింది? ఇప్పుడు ఏమి జరుగుతోందో తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వర్షబీభత్సంతో నగరంలోని నడిమివంకకు ఆనుకుని ఉన్న ప్రాంతంలో వరద పోటెత్తిందని తెలిపారు. దీన్ని రాజకీయం చేయడం మంచిది కాదన్నారు. ఏదైనా ప్రజలకు మంచి చేయలే కానీ ఏదో నోటికి వచ్చినట్లు మాట్లాడడం సరికాదన్నారు. అష్టమాసం ఎదుటి వారిపై బురద జల్లే ప్రయత్నం చేయవద్దని తెలిపారు. నడిమివంకలో గత ఐదేళ్లలో ఆక్రమణలు జరిగాయని అనడంలో ఏమాత్రం నిజం లేదన్నారు. నడిమివంక ఏర్పాటు అయినప్పటి నుంచి పేదలు పరిసర ప్రాంతాల్లో నివాసాలు ఏర్పాటు చేసుకున్నారన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ హయాంలో నడిమివంకకు రక్షణ గోడ ఏర్పాటుకు నిధులు మంజూరు చేయడంతో కొంత భాగం గోడ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఆ తర్వాత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆ నిధులను పక్కదారి పట్టించి, మునలమ్మ కట్ట నుంచి కలెక్టరేట్ వరకు రోడ్డు వేశారన్నారు. 2022లో కురిసిన వర్షాలతో ఇబ్బంది పడిన ప్రజలకు అన్ని విధాల ప్రభుత్వం సహాయ సహకారాలు అందించిందన్నారు. రక్షణ గోడ నిర్మాణానికి కూడా నిధులు మంజూరు చేయాలని అప్పటి ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా నిధులు కేటాయించారన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న మీరు నిధులు తీసుకుని రక్షణ గోడ ఏర్పాటు చేయాలని సూచించారు.

ఉపాధి పనుల గుర్తింపునకు గ్రామసభలు

చెన్నేకొత్తపల్లి: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనుల గుర్తింపునకు శుక్రవారం గ్రామసభలు జరుగుతాయని ఎంపీడీఓ గంగావతి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో పనులు గుర్తించడం జరుగుతుందన్నారు. మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఉపాధి కూలీలు, మేట్లు, శ్రమశక్తి సంఘాల సభ్యులు, గ్రామ సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది, సర్పంచ్, ఎంపీటీసీలు పాల్గొనాలని సూచించారు. ఈ గ్రామసభలకు మండల స్థాయి అధికారులను పర్యవేక్షణ అధికారులుగా నియమించడం జరిగిందని పేర్కొన్నారు.

ఆత్మకూరు: 2024–25 సంవత్సరానికి సంబంధించి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా పనుల గుర్తింపు, అభివృద్ధి ప్రణాళికల తయారీకి మండలంలోని అన్ని పంచాయతీల్లో శుక్రవారం గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శివశంకర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉపాధి హామీ కూలీలు, పంచాయతీ అధికారులు, ఉపాధి హామీ అధికారులు హాజరుకావాలని సూచించారు.

ప్రభుత్వ సేవలపై అవగాహన అవసరం

- జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్

కళ్యాణదుర్గం: పట్టణాలకు సమీపంలో ఉండేవారే కాక, ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సేవలు, పథకాలపై అవగాహన పెంచుకోవాలని జడ్జి,జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శివ ప్రసాద్ అన్నారు. గురువారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కళ్యాణదుర్గం మండల పరిధిలోని నుసికొట్టాల తండాలో న్యాయ సేవలు, ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లో నేటికీ పథకాలు తెలియని పరిస్థితి ఉందన్నారు. పట్టణ సమీపంలోని పల్లెలతో పోల్చుకుంటే మారుమూల గ్రామాలలో పరిస్థితి వ్యత్యాసంగా ఉందన్నారు. దీని వల్ల మారుమూల గ్రామాల ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ప్రతి ఒక్కరూ న్యాయ సేవలు, ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఉచితంగా న్యాయ సేవలను ఎలా పొందాలన్న విషయాలపై జడ్జి తెలియజేశారు. అనంతరం అన్ని శాఖల అధికారులు ప్రభుత్వ సేవలు, పథకాల అమలుపై ప్రజలకు వివరించారు. అనంతరం జడ్జిని వివిధ శాఖల అధికారులు సన్మానించారు. కార్యక్రమంలో డీటీ నాగరాజు, ఎంపీడీఓ సాలమాన్, ఎంఈఓ బాబు, హౌసింగ్ ఏఈ లోక్‌నాథ్ చౌదరి, సీడీపీఓ లక్ష్మీప్రసన్న, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ తిరుపాల్ నాయక్, పీఆర్ ఏఈ కిశోర్, మెడికల్ ఆఫీసర్ విజయేంద్ర, సబ్ డివిజినల్ ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు మోహన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్జి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్

5న స్టాండింగ్ కమిటీ ఎన్నికలు

- నోటిఫికేషన్ విడుదల చేసిన కమిషనర్ పీవీవీఎస్ మూర్తి

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ ఎన్నికల నోటిఫికేషన్‌ను కమిషనర్ పీవీవీఎస్ మూర్తి గురువారం విడుదల చేశారు. ఈనెల 28 వరకు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు దాఖలు చేసుకోవచ్చన్నారు. 28న సాయంత్రం 3 గంటలకు అందజేసిన నామినేషన్ పత్రాల ప్రచురణ చేస్తామన్నారు. 29న నామినేషన్ పత్రాల పరిశీలన, అదే రోజున సాయంత్రం 3 గంటలకు వ్యాలిడ్ నామినేషన్ ప్రచురణ ఉంటుందన్నారు. సెప్టెంబర్ 1న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల్లోపు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఇస్తున్నట్లు తెలిపారు. అదే రోజున సాయంత్రం 3 గంటలకు పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితా విడుదల చేస్తామన్నారు. 5న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఎన్నికల పోలింగ్ ఉంటుందన్నారు. సాయంత్రం 3 గంటలకు ఓట్ల లెక్కింపు, ఆ తర్వాత ఫలితాలను వెల్లడిస్తామని పేర్కొన్నారు.

ఆంజనేయులు కేసు విచారణ జరిపించాలి

అనంతపురం ఎడ్యుకేషన్: నగరంలోని లిటిల్ ఫ్లవర్ స్కూల్ కరస్పాండెంట్ ఆంజనేయులు కేసును సమగ్ర విచారణ జరిపించాలని సీపీఎం నగర కార్యదర్శి ఆర్వీ నాయుడు పోలీసు ఉన్నతాధికారులను డిమాండ్ చేశారు. ఆయనపై పోక్సో కేసు పెట్టడంతో ప్రజల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. ఆంజనేయులు సామాజిక కార్యక్రమాలకు అండగా నిలిచారన్నారు.

వైఎస్ జగన్‌ను కలిసిన గాజుల ఉమాపతి



వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితో పార్టీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు గాజుల ఉమాపతి

అనంతపురం కార్పొరేషన్: తాడేపల్లిలో వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు ఉమాపతి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సూచించినట్లు ఉమాపతి తెలిపారు.

భక్తిశ్రద్ధలతో ఉత్తర ఆరాధన



రాఘవేంద్ర స్వామి బృందావనాన్ని దర్శించుకుంటున్న భక్తులు

అనంతపురం కల్చరల్: గత మూడు రోజులుగా సాగిన రాఘవేంద్ర స్వామి ఆరాధనా ఉత్సవాలు గురువారం ఉత్తర ఆరాధనతో ఘనంగా ముగిశాయి. ఉదయం స్వామి బృందావనానికి పంచామృతాభిషేక, హస్తోదక సేవలు జరిగాయి. ప్రత్యేకంగా పుష్పాలంకారం చేసి ఆరాధన జరిపించారు. ఈ సందర్భంగా స్వామికి మహారథోత్సవ వేడుకలతో ఉత్సవాలకు ముగింపు పలికారు. భగవత్ సంకీర్తనల నడుమ రాఘవేంద్రస్వామి రథం మొదటి, రెండవ వీధుల్లో సాగుతున్నప్పుడు భక్తులు హారతుల పట్టి మొక్కులు తీర్చుకున్నారు. మంత్రాలయం నుంచి విచ్చేసిన ప్రవచన కర్తలు రాఘవేంద్ర వైభవం, ఉత్సవాల ప్రాధాన్యతను తెలియజేశారు. మధ్యాహ్నం మహా మంగళహారతి, తీర్థప్రసాద వినియోగం, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. నేతాజీ నగర్‌లోని రవీంద్ర స్వామీజీ ఆశ్రమంలో జరిగిన ముగింపు వేడుకల్లో పంచముఖ ఆంజనేయస్వామి, రాఘవేంద్ర స్వామికి విశేష పూజల అనంతరం అన్నప్రసాద వితరణ చేపట్టారు.

కొత్త ఆలోచనలతో ముందుకెళ్లాలి



మాట్లాడుతున్న ఎస్కేయూ ఏఐసీ ఇంకుబేషన్ మేనేజర్ చంద్రమౌళి

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక ఎస్వీ డిగ్రీ, పీజీ కళాశాలలో గురువారం ప్రపంచ వ్యవస్థాపకత దినోత్సవ వేడుకలు జరుపుకున్నారు. ఎస్కేయూ ఏఐసీ ఇంకుబేషన్ మేనేజర్ చంద్రమౌళి ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. విద్యార్థుల్లో ఉన్న ఆవిష్కరణలను ప్రభుత్వం ఏ విధంగా గుర్తిస్తుంది? కేంద్ర ప్రభుత్వ నిధులు ఎలా విడుదలవుతాయి? ఏ విధంగా స్టార్టప్‌లు ప్రారంభించాలనే అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాల వైస్ చైర్మన్ సి.చక్రధర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో విద్యార్థులు వినూత్నంగా ఆలోచించాలన్నారు. ప్రిన్సిపాల్ ప్రసాద్ మాట్లాడుతూ.. విద్యార్థులు నిరంతరం కొత్త ఆలోచనలతో ముందుకెళ్లాలన్నారు.

కొల్లాపురమ్మ విగ్రహ ప్రతిష్ట



అన్నదానం చేస్తున్న భానుకోట గ్రామస్తులు



అలంకరణలో కొల్లాపురమ్మ విగ్రహం

కనగానపల్లి: మండలంలోని భానుకోట గ్రామంలో కొల్లాపురమ్మ శక్తి దేవాలయంలో నూతన విగ్రహాన్ని ప్రతిష్టించేందుకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఇందు కోసం బుధవారం రాత్రి నుంచి వేదపండితుల ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు చేపట్టారు. గురువారం పూర్ణ కలశాలు, నవగ్రహ పూజలు, హోమాలు చేశారు. శుక్రవారం తెల్లవారుజామున 5:30 నుంచి 6:30 మధ్య అమ్మవారి విగ్రహ ప్రాణ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని పూజారి రమేష్ శర్మ తెలిపారు. కొల్లాపురమ్మ విగ్రహ ప్రతిష్ట సందర్భంగా స్థానిక గ్రామ స్థుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు.